




ఆయన రూటే సపరేటు

- 12 గంటల తరువాతే విధులు
- ఫింగర్‌ప్రింట్ నెపంతో భారీగా వసూళ్లు?
- కాసులు కురిపిస్తున్న ఎనీవేర్ విధానం
- క్రయ, విక్రయదారులకు ఖర్చు తడిసి మోపెడు
- పాణ్యం సబ్ రిజిస్ట్రార్ తీరుపై సర్వత్రా విమర్శలు

అది పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. సిబ్బంది ఠంచన్‌గా విధులకు హాజరవుతుంటారు. క్రయ, విక్రయదారులు తమ ఆస్తులను రిజిస్టర్ చేయించుకునేందుకు కార్యాలయంలో సిద్ధంగా ఉంటారు. వారికి సంబంధించిన డాక్యుమెంటేషన్ ప్రక్రియను డాక్యుమెంట్ రైటర్లు సిద్ధం చేసి కార్యాలయంలో సమర్పించేందుకు తయారుగా ఉంటారు. కానీ సబ్ రిజిస్ట్రార్ మాత్రం సమయానికి విధులకు హాజరు కారు. ఒక రోజు.. రెండ్రోజులు కాదు.. నిత్యం ఇదే పరిస్థితి. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాతే విధులకు హాజరవుతున్నట్టు తెలుస్తోంది. దీంతో సదరు అధికారి కోసం ఎదురుచూడలేక క్రయ, విక్రయదారులు విసిగిపోతున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 13 పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సహజంగా జరిగి పోవాల్సిన కార్యకలాపాలను అధికారి తనకు అనుకూలంగా మలచుకుంటున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎవరిదైనా థంబ్ (వేలి ముద్రలు) పడకపోతే అలాంటి వారి విషయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు ప్రవేశపెట్టింది. ఇందు కోసం ఎవరికీ ఎలాంటి అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం కూడా లేదని నిబంధనల్లో పొందుపరచింది. కొన్ని సందర్భాల్లో ఇవేవీ పట్టించుకోకుండా క్రయ, విక్రయదారుల నుంచి అనధికారికంగా అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పాణ్యం మండలంలోని ఓ గ్రామంలో ఓ రియల్టర్ వెంచర్ వేశాడు. సదరు వెంచర్‌లో మొత్తం 70 ప్లాట్లు ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ కోసం పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ సమయంలో వెంచర్ యజమాని థంబ్ (వేలిముద్రలు) పడలేదు. అయితే ప్రత్యామ్నాయంగా ఆయన పాన్ కార్డుతో కానీ ఇతర ప్రభుత్వం అనుమతించిన పత్రాల ద్వారా కానీ రిజిస్ట్రేషన్ చేయవచ్చు. కానీ అలా జరగలేదు. ఒకట్రెండు రోజులు పెండింగ్‌లో ఉంచారు. ఆనక వెంచర్ యజమానిని దళారుల ద్వారా డీల్ కుదుర్చుకున్నారు. అంతా ఓకే అయ్యాక వెంచర్ యజమాని పాన్‌కార్డును తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ తతంగంలో వెంచర్ యజమాని ప్లాట్‌కు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.3.50 లక్షలు ముట్టజెప్పుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



మారని అధికారి తీరు

కార్యాలయంలో సర్వం తానై వ్యవహరిస్తుండటంతో సిబ్బంది ఎవరూ అధికారికి ఎదురు చెప్పడానికి సాహసించడం లేదు. ఏ పని జరగాలన్నా, ఏది పెండింగ్‌లో పెట్టాలన్నా సబ్ రిజిస్ట్రార్‌దే అంతిమ నిర్ణయమన్నట్లు సాగుతోంది. అన్నీ సవ్యంగా ఉన్న ఫైళ్ల విషయంలో కూడా సదరు అధికారికి చేరాల్సింది చేతికి రాకపోతే పెండింగ్ పడాల్సిందేనని తెలుస్తోంది. ఏ దశలోనైనా ఆ అధికారికి అనుమానం వస్తే అలాంటి ఫైళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పెండింగ్‌లో పెట్టేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే అలాంటి వారి పనిని మరింత ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. విసిగిపోయిన వారు చివరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమో లేక స్థానిక ప్రజాప్రతినిధిని ఆశ్రయించడమో జరుగుతోంది. ఇందులో భాగంగానే పాణ్యం సబ్ రిజిస్ట్రార్ తీరు మార్చుకోవాలని ఒకట్రెండు సార్లు ప్రజాప్రతినిధి సూచించినా.. పై అధికారులు మందలించిన ఆయన తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

ముందే సాంకేతిక సమస్యలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధునికీకరించడంతో రిజిస్ట్రేషన్‌లలో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీని వల్ల పడుతున్న ఇబ్బందులు ఒక ఎత్తయితే.. అధికారి నిత్యం ఆలస్యంగా విధులకు హాజరవుతుండటంతో క్రయ, విక్రయదారులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాంకేతిక సమస్యలు.. ఇటు అధికారి ఆలస్యం వెరసి కార్యాలయ సేవలలో విపరీతమైన జాప్యం చోటుచేసుకుంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఖాళీగా కనిపిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కుర్చీ

అంతా నేనే..

కార్యాలయంలో ఏ పని జరగాలన్నా, ఏది పెండింగ్‌లో పెట్టాలన్నా సబ్ రిజిస్ట్రార్ చెప్పిందే వేదం అన్నట్లు సాగుతోందనే విమర్శలు ఉన్నాయి. ఫైళ్లు క్లియర్‌గా ఉండి అన్ని రకాల సపోర్టు పత్రాలు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారికి ఇష్టం లేకపోతే పెండింగ్‌లో పడాల్సిందే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో క్లిష్టతరంగా ఉన్న ఫైళ్ల డాక్యుమెంటేషన్ మాత్రం చకచకా జరిగిపోతుంటాయనే విమర్శలున్నాయి. అన్నీ సవ్యంగా ఉన్న డాక్యుమెంట్లు పెండింగ్‌లో పడటం.. అరకొర ఉన్నవి చకచకా రిజిస్ట్రేషన్ జరిగిపోవడం వెనుక మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు, విమర్శలతో సంబంధం లేకుండా అధికారి సూచనతో రిజిస్ట్రేషన్లు ఆగమేఘాలపై జరిగిపోతుంటాయని.. అధికారికి అనుమానం వస్తే క్వొరీలు వేస్తూ తన టార్గెట్ రీచ్ అయ్యేలా సంబంధిత క్రయ, విక్రయదారులను మధ్యవర్తుల సంప్రదింపుల ద్వారా ఒప్పించి రిజిస్ట్రేషన్ తంతు ముగిస్తుంటారని కార్యాలయ పరిసరాల్లో పలువురు చెవులు కొరుక్కుంటున్నారు.

ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారుల మాటలూ బేఖాతర్

కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఆలస్యం కావచ్చు.. అవకతవకలు కావచ్చు. ఆరోపణలు కావచ్చు.. ఇలా ఏ విషయంలోనైనా స్థానిక అధికారి చెప్పిందే వేదం. కాదని ఎవరైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. వారి నుంచి స్థానిక అధికారికి చెప్పించినా పని జరగదనే అపవాదు ఉంది. ఉన్నతాధికారులు చెప్పినప్పుడు సరేననడం.. ఆనక షరా మామూలుగా వ్యవహరించడం పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మామూలైపోయిందని పలువురు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో స్థానిక ప్రజాప్రతినిధి జోక్యం చేసుకున్నా పనులు చేయడం లేదని తెలుస్తోంది. దీంతో ప్రజాప్రతినిధి కూడా సబ్ రిజిస్ట్రార్‌పై గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

స్టాఫ్‌కు ఎలాంటి విలువ లేదు

కార్యాలయంలో పని చేసే స్టాఫ్‌కు సబ్ రిజిస్ట్రార్ ఎలాంటి గౌరవం ఇవ్వడం లేదని తెలిసింది. అనధికారికంగా అధికారికి వచ్చే రాబడిలో ఎవరికీ ఎలాంటి వాటాలు ఇవ్వనట్లు సమాచారం. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లతో లావాదేవీలు నిర్వహిస్తూ సిబ్బందిని పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. అధికారి కారు ఎక్కగానే తనకు అనుంగులైన డాక్యుమెంట్ రైటర్లు ఆమ్యామ్యాల మొత్తాన్ని తెచ్చి పెడుతున్నట్టు సమాచారం. ఏసీబీ దాడులకు జడిసి ఇలా వ్యవహరిస్తుంటారని పలువురు పేర్కొంటున్నారు. అలాగే పాణ్యం ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగినా పాణ్యం సబ్ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. అనుమతుల కోసం వచ్చేవారి నుంచి కూడా భారీ ఎత్తున లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నా దృష్టికి రాలేదు



పాణ్యం సబ్ రిజిస్ట్రార్ తీరు, అవినీతి ఆరోపణలు నా దృష్టికి రాలేదు. విచారణ చేయించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తాం. పాణ్యం సబ్ రిజిస్ట్రార్ పనివేళల్లో అందుబాటులో ఉండి క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం.

-చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: ఎస్పీ


మాట్లాడుతున్న కె.రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 13 : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని కాలేజీలు, స్కూళ్లు, ఎన్‌జీవోల ద్వారా విద్యార్థులు, డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాని అన్నారు. మంగళవారం ఆయన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆర్టీవో శివారెడ్డితో కలిసి ఎన్‌హెచ్-40 రహదారిలో గల బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ హైవేలలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల సోలార్ బ్లింకర్స్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. హైవేలలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్న చోట (బ్లాక్‌స్పాట్)లవద్ద వాహనాల వేగం తగ్గించడానికి బారికేడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రిళ్ల కనిపించేలా రేడియం స్టిక్కర్లతో ఏర్పాటు చేయాలని సూచించారు. డివైడర్లు దాటే ప్రదేశాల్లో జీబ్రాలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. హైవేలపై డివైడర్లు దాటే ప్రదేశాల్లో జీబ్రాలైన్లు చెడిపోయాయని అలాంటిచోట్ల మళ్లీ వేయాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చోటల్లా రాత్రిపూట రోడ్డు కనిపించేలా ఇరువైపులా క్యాట్ ఇస్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడంవల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అందువల్ల ద్వి చక్రవాహనదారులంతా హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సాయి, కార్తీక్, హరినాథ్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్, కాంట్రాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చెరుకుచర్ల బయటకు..

- వైసీపీకి నందికొట్కూరులో షాక్
- పార్టీని వీడిన రాష్ట్ర అదనపు కార్యదర్శి
- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్న రఘురామయ్య

నందికొట్కూరు ఫిబ్రవరి 13: నందికొట్కూరు నియోజకవర్గంలోని వైసీపీకి భారీ షాక్ తగిలింది. తనకు పార్టీలో గౌరవ మర్యాదలు లభించడం లేదని, తన స్నేహితుడైన ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌కు టిక్కెట్ కేటాయించకలేదని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచర్ల రఘురామయ్య పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత దగ్గరి సంబంధం ఉన్నా సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరు వల్ల పార్టీని


వైసీపీకి చేసిన రాజీనామా లేఖను చూపుతున్న చెరకుచర్ల రఘురామయ్య

వీడుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలో తాను చేర్పిన వారికి ఉన్న గౌరవం తనకు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అన్ని రకాలుగా ఆమోదయోగ్యుడైన అర్థర్‌కు టిక్కెట్ ఇవ్వకపోవడం వల్లే తాను పార్టీకి రాజీనామా చేశానని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి నుంచి తనకు అడుగడుగునా అవమానాలు జరిగాయని అన్నారు. టికెట్ల కేటాయింపుల్లో దళితులకు, బీసీల గొంతుకోసి వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాజకీయ వ్యవస్థనే లేకుండా చేసిన రాజకీయ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. అభివృద్ధి పనుల గురించి నాయకులు అధికారులను సంప్రదిస్తే.. నిధులు లేవని, తామేమీ చేయలేమని వారు చెబుతున్నారని అన్నారు. అవినీతి రహిత పాలన అని చెప్పుకున్న జగన్ నాయకత్వంలో పాలన అవినీతి మయమైందన్నారు. మద్యపానాన్ని నిషేధిస్తానని చెప్పిన జగన్.. నకిలీ మద్యం విధానంతో వేల మంది మరణించారని అన్నారు. త్వరలోనే తన అనుచరులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు.

ధర్మం కోసం.. దేశం కోసం..

- సంఘ్ కార్యకర్తల నిరంతర కృషి
- ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 13: హిందూ ధర్మం కోసం.. దేశం కోసం సంఘ్ కార్యకర్తలు అనునిత్యం పాటుపడుతున్నారని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ అన్నారు. సంఘ్ ద్వారా తయారైన కార్యకర్తలతోనే వికసిత భారతదేశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలులోని ఇండస్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్ కార్యక్రమానికి మోహన్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. సమాజ ఉన్నతిలోనే మన ఉన్నతి అనే భావనతో డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను


ప్రసంగిస్తున్న సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్

స్థాపించారన్నారు. ఇదే భావన నేడు దేశమంతా వ్యాపించిందన్నారు. అయితే ఈ భావన చాలామందిలో అంతర్లీనంగా ఉందని, దాన్ని బయటకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మన శ్రద్ధ నిష్ఠలను తగ్గించుకోకుండా, అకుంఠిత దీక్షతో పనిచేయడం ద్వారా సుఖశాంతులతో తులతూగే వికసితభారతదేశం సాధ్యమవుతుందన్నారు. శరీరం, మనసు, బుద్ధిని ఏకీకృతం చేసి సాధన చేయాలని, సత్య న్యాయ సమ్మిళితమైన మార్గంలో ధైర్యంగా నడవాలని కార్యకర్తలను ఆయన కోరారు. విద్యార్థులు, యువకులు, పెద్దలకు ఉన్న సంఘం శాఖల ద్వారా బస్తీల వికాసం జరగాలని, సమాజహితం కోసం స్వయం సేవకులు పనిచేయాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 50 బస్తీల నుంచి 1,287 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ క్షేత్ర సంఘచాలక్ నాగరాజు, ప్రాంత సంఘచాలక్ శ్రీహరి కుమార్ రెడ్డి, విభాగ్ సంఘచాలక్ నీలకంఠ, జిల్లా సంఘచాలక్ ఎస్‌వీఎస్ గుప్త, నగర సంఘచాలక్ చల్లా వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ పోస్టింగ్‌ల్లో మార్పులు

కర్నూలు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డీఎస్పీ పోస్టింగుల్లో కొన్ని మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆళ్లగడ్డ డీఎస్పీగా షర్ఫుద్దీన్‌ను నియమించింది. ఈయన ఏసీబీ విభాగంలో డీఎస్పీగా ఉంటూ పల్నాడు ఎస్సీ ఎస్టీ సెల్‌లో కూడా డీఎస్పీగా ఉన్నారు. అలాగే ప్రస్తుతం ఆళ్లగడ్డకు బదిలీ చేసిన సుధాకర్ రెడ్డిని ఏసీబీ విభాగానికి బదిలీ చేసి అక్కడి నుంచి చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేశారు. అలాగే తేజేశ్వర్‌రావును చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించి తర్వాత సైబర్ క్రైమ్ ఏసీబీగా నియమించారు. అలాగే యుగంధర్‌బాబును పశ్చిమగోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీగా నియమించి అక్కడి నుంచి ఏసీబీ విభాగానికి బదిలీ చేసింది.

పోస్టులు తక్కువ.. ఫీజులు ఎక్కువ

- ఇదీ ఏపీ టెట్ దుస్థితి
- దరఖాస్తులకు ఫీజు పెంపు
- 2022తో పోలిస్తే పేపర్‌కు రూ.250 అదనం
- ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు లేదు





నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 13: టెట్ కు దరఖాస్తు చేసుకోవడమంటే మాటలు కాదు. పరీక్షలో పోటీ పడటం సంగతి అటుంచి, దరఖాస్తు చేసుకోవాలంటే ఫీజు కట్టడానికే యాతన పడాలి. డీఎస్సీ 2024కై ప్రభుత్వం టెట్ ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుతున్నారు. అయితే పెంచిన ఫీజు పేద అభ్యర్థులకు కష్టంగా మారింది. అధికారంలోకి రాగానే 23వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి మాట ఇచ్చి మడమ తిప్పారని నిరుద్యోగులు ఆరోపిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఎన్నికల వాతావరణం రాగానే ఎట్లాగైనా ఈసారీ ఎట్లు దండుకోడానికి వైసీపీ ప్రభుత్వం టెట్ ప్రకటన చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2022లో చివరిసారిగా వైసీపీ ప్రభుత్వం ఏపీ టెట్ నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున వసూలు చేశారు. తాజాగా ఇప్పుడు ఒక్కొక్క పేపర్‌కు రూ.750 ఫీజు నిర్ణయించారు. నిరుద్యోగభారంతో బతుకీడుస్తున్న తాము ఇంత ఫీజులు కట్టి దరఖాస్తు ఎటా చేసుకోవాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు.



ఇంత ఫీజులు కట్టి.. పుస్తకాలు కొని..

టెట్‌తోపాటు డీఎస్సీకి సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాల కోసం రూ.5వేల నుంచి రూ.7వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు శిక్షణ ఇచ్చేలా స్టడీ సర్కిళ్లు ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో అవి కనుమరుగయ్యాయి. స్వంతంగా అభ్యర్థులు పరీక్షకు సిద్ధమవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫీజుల కోసం, పుస్తకాల కొనుగోళ్ల కోసం అప్పులు చేసి తిప్పలుపడాల్సి వస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులో టెట్, డీఎస్సీ పరీక్షలు తక్కువ సమయంలోనే ప్రభుత్వం నిర్వహిస్తుండటంతో ఆ సమయంలో బండెడు సిలబస్‌ను ఎలా పూర్తిచేయాలని తల పట్టుకుంటున్నారు. నాలుగున్నరేళ్ల సమయాన్ని ప్రభుత్వం నిరుద్యోగులకు కేటాయించకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆఘమేఘాలపై అరకొర పోస్టులను భర్తీ చేయాలనుకోవడం ఏమిటని ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు

కేంద్రం టెట్ కన్నా అధికం



గత నెలలో కేంద్ర ప్రభుత్వం సి-టెట్ పరీక్ష నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు కేంద్రం రూ.500 చొప్పున ఫీజు వసూలు చేసింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే తీసుకుంది. అదే రాష్ట్రానికి వచ్చేసరికి పేపర్‌కు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నింటికీ చెల్లించాలి. డీఎడ్, బీఈడీ, ఎంఈడీ విద్యార్హత ఉన్న వారు టెట్ మూడు పేపర్లను రాస్తారు. అదే డీఈడీ, బీఈడీ రెండు అర్హతలుంటే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తర్వాత డీఎస్సీ లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్కో పేపర్‌కు రూ.750చొప్పునమూడు పేపర్లకు రూ.2250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటు దరఖాస్తు చేసుకున్నందుకు ఇంటర్నెట్ షాపుల్లో రూ.100నుంచి రూ.200వరకు వసూలు చేస్తున్నారు. ఈ నెల 8నుంచి 17వ తేదీవరకు ఏపీ టెట్ పరీక్షకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఫీజు తగ్గాల్సిందిపోయి పెంచడమేంటని నిరుద్యోగులు మండిపడుతున్నారు. సోమవారం డీఎస్సీ ప్రకటన విడుదల అయినప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇవ్వలేదు. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించవచ్చని భావిస్తున్నారు. ఎంత ఫీజు అనేది ఇంకా నిర్ణయించలేదు. 2018డీఎస్సీకి హాజరైన అభ్యర్థులనుంచి రూ.500 చొప్పున డీఎస్సీ దరఖాస్తుకు ఫీజు వసూలు చేశారు.

విశ్వకర్మ యోజన దరఖాస్తులను పరిష్కరించండి

కలెక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పథకానికి ఉమ్మడి జిల్లాల నుంచి 1,46,284 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ (2023-24) ద్వారా 158 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 149 దరఖాస్తులను గడువులోపే పరిష్కరించామని అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల జీఎం ఎన్‌ఎస్‌ఆర్‌సీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, డీపీవో నాగరాజు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

దేవనకొండ, ఫిబ్రవరి 13 : చదువుకొని మంచిగా మెలగాలని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అలారుదిన్నెలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రవి, సోమలింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు కార్తీక్ (14) ఆదోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత నెల రోజుల కిందట చదువుకోనని మొండికేయడంతో హాస్టల్ నుండి రవి గ్రామానికి పిలుచుకువచ్చారు. అనంతరం దేవనకొండలో ఓ బైక్ రిపేరి షాపులో మెకానిక్ పని నేర్చుకునేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కర్నూలు ఆస్పత్రిలో కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్...ముగ్గురు అరెస్టు

వెల్దుర్తి, ఫిబ్రవరి 13: మండలంలో బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రామళ్ళకోట గ్రామంలో ఈనెల 3వతేది ఓ బాలికను ఉదయం 9 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన లింగమయ్య, జయరాముడు, శేఖర్ కిడ్నాప్ చేశారని అన్నారు. బాలిక నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. నింది తులను అరెస్టుచేసి డోన్ కోర్టులో హాజరుపరచామని, కోర్టు వారిని రిమాండ్ విధించిందని తెలిపారు. బాలికను నానమ్మకు అప్పగించామని తెలిపారు.

శ్రీశైలంలో అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో నిందుతులు

శ్రీశైలం, ఫిబ్రవరి 13: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో దొంగతనాలు చేస్తున్న ఇద్దరిని సోమవారం శ్రీశైలం ముఖద్వారం వద్ద నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. గత నెల 23వ తేదీన శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాంబికా వాణిజ్య సముదాయంలోని ఎఫ్ 3 దుకాణంలో ఈ ఇద్దరు దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందని శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. మాచర్లకు చెందిన హరిబాబు, శంకర్ దేవస్థానం పరిధిలోని డార్మిటరరీలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వీరిపై మాచర్ల, రెంటచింతల, చిలకలూరిపేట, తెలంగాణలో పలు కేసులు నమోదయినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి వీరిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

కర్నూలు, ఫిబ్రవరి 13: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోడుమూరు రహదారిలోని కింగ్ ప్యాలెస్ కన్వెన్షన్ హాల్లో జరిగే ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనుమడు పెళ్లి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్నారు. ఈ మేరకు డీఐజీ విజయరావు నేతృత్వంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా నుంచి ఒక అడిషినల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 17 మంది ఎస్‌ఐలు, 63 మంది ఏఎస్‌ఐలు హెడ్ కానిస్టేబుళ్లు, 130 మంది కానిస్టేబుళ్లు, 18 మంది మహిళా పోలీసులు, 70 మంది హోంగార్డులు ఈ బందోబస్తులో పాల్గొంటారు. అలాగే ఇతర జిల్లాల నుంచి ఒక అడిషినల్ ఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 9 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 50 మంది ఏఎస్‌ఐలు, 110 మంది కానిస్టేబుళ్లు, 18 మంది మహిళా పోలీసులు, 50 మంది హోంగార్డులు, మూడు స్పెషల్ పార్టీలు, 97 మంది ఏఆర్ పోలీసులు ఈ బందోబస్తులో పాల్గొంటారు.

సీమ సమస్యలను మేనిఫెస్టోల్లో పొందుపరచాలి

- కృష్ణా జలాల కేటాయింపులో వివక్షకు సమాధానం చెప్పాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా లేఖ



నంద్యాల టౌన్, ఫిబ్రవరి 13 : రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలలో రా యలసీమ సమస్యను చేర్చాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ సమగ్రాభివృద్ధికై రాజకీయ పార్టీలు చేపట్టాల్సిన అంశాలను కోరుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు దశరథరామిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నంద్యాలలో సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల కేటాయింపుల్లో రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం అటుంచి, పాలకులు రాయలసీమ సాగునీటి అభివృద్ధిపై అశ్రద్ధ వహించడం మరింత శోచనీయమని అన్నారు. రాయలసీమ ప్రాంతం ఇతర అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంతో సమానాభివృద్ధికి పాటు పడాల్సిన పాలకులు రాయలసీమకు కేవలం 15 శాతం బడ్జెట్ కేటాయింపులు చేసి, 85 శాతం బడ్జెట్ నిధులు కోస్తా ప్రాంతానికి కేటాయించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. పాలకుల నిర్లక్ష్యం వలన కృష్ణా నదీ జలాల నీటి కేటాయింపులలో వెనుకబడిన రాయలసీమ తీవ్ర వివక్షతకు గురవుతోందని, సాగునీటి అంశంలోనే కాకుండా అన్ని రంగాలలో రాయలసీమ పాలకుల విధానాల వల్ల పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలవుతున్నా విభజన చట్టంలో రాయలసీమకు కల్పించిన హక్కులను అమలు పరచడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు కేటాయించిన నీటిలో 40 శాతం కృష్ణా జలాలను వినియోగించుకోడానికి ప్రాజెక్టుల స్థిరీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టం అనుమతించిన తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ -నీవా, వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేసి రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయడమే కాకుండా, పట్టిసీమ-పోలవరం ద్వారా ఆదా అయిన 80 టీఎంసీల కృష్ణా జలాలను ఈ ప్రాజెక్టులకు నికర జలాలుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వకర్మ యోజన పథకం అమలు కమిటీ సభ్యుడిగా కాశీవిశ్వనాథ్



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: పీఎం విశ్వకర్మ యోజన పథకం ఇంప్లిమెంటేషన్ జిల్లా కమిటీ సభ్యుడిగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబలి కాశీవిశ్వనాథ్ నియమితు లయ్యారు. కాశీ విశ్వనాథ్ విద్యార్థి దశలో ఏబీవీపీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పని చేశారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇచ్చినటువంటి ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన పథకానికి న్యాయం చేస్తామని కాశీ విశ్వనాథ్ తెలిపారు. తనను నియమించినందుకు బీజేపీ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలంకి రామస్వామి అభినందించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబ ర్‌లో జర్నలిస్టుల ఇంటి స్థలాల మంజూరుకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జీవో.నెం. 535లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలి పారు. 5 సంవత్సరాల అనుభవం కలిగిన 368 మంది అక్రిడిటేషన్ జర్నలిస్టుల జాబితా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా వచ్చిందన్నారు. ఈ జాబి తాను మండల వారిగా విభజించి తహసీల్దార్లకు పంపించి వెరిఫికేషన్ చేయించామన్నారు. దరఖాస్తు చేసుకున్న విలేకరులు కోరుకున్న విధంగా మండ లాల్లో, డివిజన్ కేంద్రాల్లో, కర్నూలు నగరంలో ఇళ్ల స్థలాల కోసం భూములను గుర్తించామని అన్నారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీంకు సంబంధించిన కమిటీ సభ్యులు ఆ స్థలాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కర్నూలు నగరానికి సంబంధించి రెండు చోట్ల భూమిని గుర్తించామని, తహసీల్దార్లతో కలిసి వెంటనే ఆ భూములను పరిశీలించి తమ అభిప్రాయం చెప్పాలని తెలిపారు. అనర్హు లుగా గుర్తించిన జర్నలిస్టుల వెరిఫికేషన్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే డీఆర్వో సంబంధిత తహసీల్దార్‌కు తెలియజేయవచ్చునని సూచించారు. అదే విధంగా నంద్యాల జిల్లాకు సంబంధించిన 15 మంది విలేకరులు కర్నూలు జిల్లాలో పని చేస్తున్నామని, కర్నూలు నగరంలో స్థలం కావాలని కోరుతున్నారని, ఈ జాబితాను నంద్యాల డీఆర్వో కి పంపించి వెరిఫై చేయించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, సమాచార శాఖ డీడీ జయమ్మ, కమిటీ సభ్యుడు నాగిరెడ్డి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రమణీయం.. కొలనుభారతి క్షేత్రం..!



నల్లమల ప్రకృతి అందాల నడుమ కొలనుభారతి క్షేత్రం



ఆత్మకూరు/కొత్తపల్లి, ఫిబ్రవరి 13: చదువుల తల్లి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం, బీజాక్షర క్రతువులు చేపడితే త్వరగా విద్యాబుద్ధులు సిద్దిస్తాయని హిందూవుల నమ్మకం. ఇప్పటికీ సర స్వతీ అమ్మవారిని ప్రతి ఒక్కరు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఇంతటి మహిమ గల సరస్వతి అమ్మవారి క్షేత్రం కొత్తపల్లి మండ లంలోని నల్లమల ప్రకృతి అందాలలో ఉంది. మాఘశుద్ధ పంచమి, అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కొలనుభారతి క్షేత్రంలో వసంతపంచమి వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకను పురస్కరించుకుని వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకోనున్నారు. భక్తులకు ఏలోటు రానివ్వకుండా దేవస్థానంతో పాటు ఆయాశాఖల అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేశంలోని మూడు ప్రధాన సరస్వతీ ఆలయాల్లో రెండో ఆలయంగా శ్రీకొలనుభారతి క్షేత్రం పేరుగాంచింది.

నేడు వసంతపంచమి వేడుకలు

మొదటగా జమ్ము కాశ్మీర్‌లోని శారదపీఠం వద్ద వెలసిన సరస్వతీ క్షేత్రం. ఆ తర్వాత మన రాష్ట్రంలోని కొలనుభారతి క్షేత్రానికే అంతటి ప్రాముఖ్యత ఉందని పురాణాలు చెబుతున్నాయి. మూడవ క్షేత్రంగా తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్ జిల్లాలో వున్న బాసర సరస్వతి అమ్మవారి ఆలయం గుర్తింపు దక్కించుకుంది. కాగా శారదపీఠం, కొలనుభారతి క్షేత్రంలో సరస్వతి అమ్మవారి మూలవిరాట్ ఎదుట శ్రీచక్రం ఉండటం విశేషంగా చెప్పవచ్చు. కొలనుభారతి క్షేత్రంలో వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి శ్రీశైల దేవస్థానం తరపున ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. తెల్లవారుజామున 5:30 గంటలకు శ్రీశైలం దేవస్థానం నుంచి అమ్మవారికి తెచ్చిన పట్టువస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు తెలిపారు.

క్షేత్రానికి ఇలా చేరుకోవాలి: నంద్యాల నుంచి 48కిమీల దూరంలో వున్న ఆత్మకూరు పట్టణానికి చేరుకోవాలి. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న శివపురం గ్రామానికి ప్రైవేట్ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. శివపురం నుంచి శివపురం చెంచుగూడేం మీదుగా ఐదు కిలోమీటర్ల అటవీమార్గంలో ప్రయాణిస్తే కొలనుభారతి క్షేత్రానికి చేరుకోవచ్చు.

వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం



కొలనుభారతి క్షేత్రంలో బుధవారం జరిగే వసంత పంచమి వేడుకలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. క్షేత్ర ప్రాంగణంలోని చలువ పందిళ్లు, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లకు చర్యలు తీసుకున్నాం. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు ప్రత్యేక వేదికతో పాటు పురోహితులను అందుబాటులో ఉంచాం. వైద్య శిబిరంతో పాటు వాహనాల పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశాం

- మోహన్, కొలనుభారతి ఆలయ ఈఓ

కొలనుభారతిలో భారీ బందోబస్తు



కొలనుభారతి క్షేత్రంలో బుధవారం జరిగే వసంతపంచమి సందర్భంగా 60 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇద్దరు సీఐలు, 40 మంది ఎస్‌ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, మహిళా పోలీసులను నియమించాం. భక్తులు సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలి. శివపురంగూడెం వద్దనే ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో భక్తులను తరలిస్తాం.

- నాగభూషణ్, సీఐ, ఆత్మకూరు రూరల్

భారతరత్న ఇస్తే సరిపోతుందా?

- చరణ్ సింగ్, స్వామినాథన్‌ల స్ఫూర్తి ఏదీ?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 13: దేశంలో అత్యధికంగా ఆధారపడిన ప్రజల వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించకుండా ఎన్నికలు సమీపిస్తున్నందు వల్ల కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి చరణ్ సింగ్‌కు డా.స్వామినాథన్‌కు భారతరత్న బిరుదులు ఇచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం పత్తికొండకు వచ్చిన రామకృష్ణ పార్టీ స్థానిక కార్యాలయంలో కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్యతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతాంగ ఓట్లను దండుకునేందుకు మాజీ ప్రధాన మంత్రి చరణ్ సింగ్‌కు, వ్యవసాయ రంగ పరిరక్షణకు సూచనలు అందించిన డాక్టర్ స్వామినాథన్‌లకు భారతరత్నల అవార్డులు ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని అన్నారు. ఈ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజాసాహేబ్, సీపీఐ సీనియర్ నాయకులు భీమలింగప్ప, ప్రజా సంఘాల నాయకులు వీరన్న, గురుదాస్, పెద్దయ్య, కారన్న, కారుమంచి, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

ఎటూ తేలని పత్తికొండ పంచాయితీ..!

- జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు
- ఎమ్మెల్యే శ్రీదేవికి టికెట్ ఇవ్వకండి
- అసమ్మతి నాయకుల స్పష్టం



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీదేవి, నాగరత్నమ్మ



జగన్‌తో మురళీధర్ రెడ్డి



పత్తికొండ, ఫిబ్రవరి 13: ఎమ్మెల్యే టికెట్ కోసం పత్తికొండ వైసీపీలో మూడు ముక్కలాట జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈసారి తనకే టికెట్ అంటూ చెప్పుకుంటున్నారు. ఇక మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె నాగరత్నమ్మ, సీనియర్ నాయకుడు పోచంరెడ్డి మురళీధర్ రెడ్డి టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తారస్థాయికి చేరిన పత్తికొండ వైసీపీ విభేదాలు తాడేపల్లికి చేరాయి. మంగళవారం వైసీపీలోని మూడు వర్గాల నాయకులు సీఎం జగన్‌ను కలిశారు. తాడేపల్లి క్యాంపు ఆఫీసులో సీఎం జగన్ టికెట్ ఆశిస్తున్న ముగ్గురితో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఎవరూ ఏకాభిప్రాయానికి రాకపోవడంతో అభ్యర్థి ఎంపికను సీఎం జగన్ వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అందరి సహకారంతో గెలిచినా...

2019 ఎన్నికల్లో భర్త హత్య సానుభూతితో టికెట్ సాధించుకున్న కంగాటి శ్రీదేవి గెలుపు కోసం నాగరత్నమ్మ, ఆమె భర్త రామచంద్రారెడ్డి, పోచంరెడ్డి మురళీధర్ రెడ్డి ఎంతగానో శ్రమించారు. అందరి సహకారంతో ఎమ్మెల్యేగా నెగ్గిన శ్రీదేవి ఆ తర్వాత నియోజకవర్గంలో తన సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటూ వచ్చారు. ఇదే సమయంలో నాగరత్నమ్మ, మురళీధర్‌రెడ్డి వర్గాలను అణగదొక్కేలా ఆమె వ్యవహరించారంటూ వైసీపీలోనే కొందరు ఆరోపిస్తున్నారు. పలుమార్లు జగన్ పర్యటన సందర్భంగా మురళీధర్ రెడ్డి ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీలను తొలగించాలంటూ అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి చేయించారు. ఇక ఎమ్మెల్యే శ్రీదేవి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు వైసీపీలోని రెండు వర్గాలు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పత్తికొండలో పార్టీ పరిస్థితిని గమనించిన సీఎం జగన్ మూడు వర్గాల నాయకులను తాడేపల్లికి పిలిపించారు. వారి మధ్య సయోధ్యకు ఆయన ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. శ్రీదేవికి మళ్లీ టికెట్ ఇస్తే తాము సహకరించే ప్రసక్తే లేదని వారు సీఎం జగన్ వద్ద కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం.

ఉత్తీర్ణత శాతం పెరగాలి: డీఈవో



కొట్టాలచెరువులో హాస్టల్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో

ఆత్మకూరు, ఫిబ్రవరి 13: జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఐఎఫ్‌పీ (పరస్పర ప్రభావశీల వ్యవస్థ) ప్యానల్స్ ద్వారా బోధన సాగించాలని, పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని డీఈవో సుధాకరరెడ్డి సూచించారు. మంగళవారం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి కాంప్లెక్స్ మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబులు వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. అనంతరం ప్రధానమంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో రూ.2.3కోట్లతో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న గిరిజన వసతి గృహానికి సంబంధించి రెవెన్యూ అధికారులు సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో కురుకుంద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల ప్రణాళికపై అక్కడి హెచ్ఎంను ఆరా తీశారు. అలెస్కో కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, మండల విద్యాశాఖాధికారులు జానకీరామ్, సురేష్ తదితరులు ఉన్నారు.

'గెలుపు కోసం అవిశ్రాంతంగా పోరాడాలి'



బి.కోడూరులో జనసేన జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 13: టీడీపీ, జనసేన కూటమి గెలుపు కోసం రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల వరకు అవిశ్రాంతంగా పోరాటం చేయాలని ఆ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బి.కోడూరు గ్రామంలో జనసేన జెండాను వారు ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, జనసేన నాయకులు విశ్వనాథ్, అశోక్‌కుమార్, మండల అధ్యక్షుడు సురేష్ అన్నారు. బాలుడు, అంకిరెడ్డి, ప్రతాప్, చలమయ్య శ్రీరాములు, శాలుబాషా, మల్లేష్, సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాములపాడు, ఫిబ్రవరి 13: మండలంలోని వేంపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంతోష్‌రాజ్ రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం హెచ్ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సోలార్ అగ్రికల్చర్ పెస్టిసైడ్ విత్ స్ప్రేయర్ అతి తక్కువ ఖరీదుతో చేసే విధానంపై వివరించడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అలాగే ఈ నెల 18,19న చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి: ఏడీఏ



వెలుగోడులో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు, ఫిబ్రవరి 13: మండలంలోని రైతులు పీఎం కిసాన్ లబ్ధి కోసం ఈకేవైసీ చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ సూచించారు. వెలుగోడు పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యలయంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారి పవన్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏఈవో సుధారాణి, నాగశివసాయి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పాములపాడు, ఫిబ్రవరి 13: మండలంలోని జూటూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జమ్ములమ్మ ఆలయ నిర్మాణానికి వేంపెంట సొసైటీ చైర్మన్ వెంకటస్వామి, కుమారుడు టి.నాగరాజు రూ.20 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందచేశారు. వారు మాట్లాడుతూ నేషనల్ హైవే విస్తరణ పనులలో జూటూరు గ్రామవలోని కేజీరోడ్డు సమీపంలోని జమ్ములమ్మ గుడిని తొలగిస్తున్నారని, ఈ క్రమంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆలయానికి విరాళం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు చరణ్, మనోహర్, చిన్న ఈశ్వరయ్య, మౌలాలి, చిన్న మద్దిలేటి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అప్పారావు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 13: ఎన్‌టీఏ మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాల్లో నంద్యాల రావూస్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపి పర్సంటైల్స్ సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ బీవీ కార్తికేయశర్మ 97.938, ఆర్.విష్ణుప్రియ 90.336, ఇ.సౌజన్య 89.129, పద్మావతి 88.498 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు 10మంది విద్యార్థులు మెరుగైన పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను అప్పారావు, కళాశాల డైరెక్టర్ మోనిచంద్ర, ప్రిన్సిపాల్ సుంకయ్య అభినందించారు.

ప్రభుత్వ కార్యక్రమమా?.. వైసీపీ ప్రచారమా?

- జగన్‌ను గెలిపించాలంటూ వైసీపీ నాయకుల ప్రసంగాలు
- స్వామి భక్తి చాటుకున్న అధికారులు
- రాజకీయ వేదికగా మారిన 'ఆసరా చెక్కు' పంపిణీ కార్యక్రమం
- విస్తుపోయిన పొదుపు మహిళలు



వైసీపీ జెండా రంగులతో బెలూన్లు

పాములపాడు, ఫిబ్రవరి 13: వైఎస్సార్ నాలుగో విడత ఆసరా కార్యక్రమం అధికారులు అండగా ఉండటంతో వైసీపీ నాయకులు ఈ సమావేశాన్ని ఎన్నికల ప్రచారంగా వినియోగించుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించాలంటూ ప్రసంగిస్తుండటంతో ఆసరా కార్యక్రమమా? లేకపోతే ఎన్నికల సభనా అంటూ కొంతమంది పొదుపు మహిళలు విస్తుపోయారు. మంగళవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధీర్, మండల ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఏపీఎం అనురాధ మాట్లాడుతూ మండలంలోని అర్హత పొందిన 768 సంఘాలకు రూ.4.94 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సుధీర్ మాట్లాడుతూ వైసీపీతోనే అభివృద్ధి జరిగిందని, జగన్‌కు ఓట్టువేసి అధికారం కట్టబెట్టాలని పొదుపు మహిళలను కోరారు. వైసీపీ నాయకులంతా ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని మర్చిపోయి జగన్ ఎన్నికల మంత్రం పఠించారు. దీంతో ఆసరా కాస్త ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. సమావేశానికి అధికారులు వైసిపి రంగులతో కూడిన బెలూన్‌లను ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ కార్యక్రమమా? వైసిపి కార్యక్రమమా అని పలువురు చర్చించుకొన్నారు. సమావేశానికి హాజరు కాకపోతే మీ అకౌంటులలో డబ్బులు పడవని బెదిరించడంతో ఎండలు ఉన్నా వచ్చామని మహిళలు కొంతమంది వాపోయారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు అంతం తప్పదు: టీడీపీ



నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న జయసూర్య



కానాలపల్లెలో పాల్గొన్న నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 13: రాక్షస పాలనకు అంతం తప్పదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. పట్టణంలోని 14, 11వ వార్డులలో మంగళవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 14వ వార్డు ఇన్‌చార్జి ఎం.సురేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీల్లోని ప్రజలు పలు సమస్యలను టీడీపీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే కనీసం మురుగు కాలువలు నిర్మించడం లేదని, ఎన్ని సార్లు అడిగినా వైసీపీ నాయకులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. సాయంత్రం 11వ వార్డు ఇన్‌చార్జి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళల ఆర్థికాభివృద్ధికి అధినేత చంద్రబాబు దోహదం చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, షకీల్ అహ్మద్, ముర్తుజావలి, కళాకార్, అయ్యారాజు, చింత గోపాల్, మల్లికార్జునరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, మధు గౌడ్, వంశీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: రాష్ట్రంలో చంద్రబాబు రాకతోనే ప్రజల, యువతకు భవిష్యత్తు ఉంటుందని కానాలపల్లె టీడీపీ నాయకుడు గోవింద భూపాల్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచి ప్రజలకు అవగాహన కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, యువతకు ఉపాధి గానీ లభించలేదని అన్నారు. రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ బూత్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, హుసేని, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నేటి నుంచి కార్యాచరణతో ఉద్యమం'

ఆత్మకూరు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి కార్యచరణ ప్రకారం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ సి.మోహన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, ఏపీఎన్జీవోస్ తాలుకా కార్యదర్శి సాజిద్‌బాషా, విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షులు అచ్చయ్య తెలిపారు. మంగళవారం ఆత్మకూరు పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తమ డిమాండ్ల సాధనకై చేపట్టబోవు ఉద్యమ కార్యాచరణను ఈనెల 12వ తేదిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశామని, అయితే వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో 14 నుంచి కార్యాచరణ ప్రకారం ఉద్యమంలోకి వెళ్లనున్నట్లు వివరించారు. 14న నల్లబ్యాడ్జీలు ధరించి తాలుకా, జిల్లా స్థాయిలో నిరసలు చేసిన తహసీల్దార్, ఆర్డీవోలు, కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేయడం, 15,16 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు చేయడం, 17న తాలుకా స్థాయిలో ర్యాలీలు, ధర్నాలు, 20న జిల్లా కేంద్రంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 24 వరకు రాష్ట్రస్థాయి నాయకులు జిల్లా పర్యటించి ఉద్యమాన్ని ఉధృతం చేయడం, 27న ఛలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 13: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం గుంటూరుకు చెందిన చింతల అన్నపూర్ణ రూ.1,00,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్ ప్రసాద్‌కు అందజేశారు. భక్తురాలికి అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

'సమస్యలు పరిష్కరించాలి'



నంద్యాలలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 13: సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో వేతనాన్ని చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకు అతిగతి లేదన్నారు. చైర్‌పర్సన్ మాబున్నీసాకు ఏఐటీయూసీ పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. గౌరవ అధ్యక్షుడు కె.ప్రసాద్, అధ్యక్షుడు కె.రంజిత్‌కుమార్, కార్యదర్శి ప్రతాప్, ఉప కార్యదర్శి జె.చిన్నమ్మ, సలహాదారుడు మస్తానయ్య, మంగమ్మ, మద్దయ్య, జయమ్మ, ఓబులేసు, కమలాకర్, శివరాముడు, తదితరులు పాల్గొన్నారు.


నేడు కొత్తపల్లిలో 'జయహో బీసీ'

కొత్తపల్లి, ఫిబ్రవరి 13: కొత్తపల్లిలో బుధవారం సాయంత్రం 4 గంటలకు 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజరాజేశ్వరి పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయహో బీసీ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరవుతున్నట్లు తెలిపారు. టీడీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అభిమానులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలి'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 13: ఎఫ్‌పీవో సభ్యులు బిజినెస్ చేసి అభివృద్ధి చెందటంతో పాటు ఆర్థికంగా మెరుగుపడాలని ఎల్‌డీఎం రవీంద్ర కుమార్ సూచించారు. మంగళవారం నంద్యాల డ్వామా కాన్ఫరెన్స్ హాలులో నాబార్డు ఆధర్వంలో బ్యాంకర్ల సమావేశం జరిగింది. నాబార్డు డీడీఎం ఎం.సుబ్బారెడ్డి ఎఫ్‌పీవోల అనుసంధానం గురించి వివరించారు. ఎఫ్‌పీవోల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాపార కార్యకలాపాలతో పాటు బ్యాంకు ద్వారా లోను సౌకర్యం ఎలా పొందాలో ఏపీఎంఎఎస్ కో ఆర్డినేటర్ మహేష్ అలగప్ప వివరించారు. రైతు సంఘాలకు రుణ సౌకర్యం ఇచ్చే పథకాల గురించి ఎస్‌బీఐ, ఏపీజీబీ రీజనల్ మేనేజర్లు తెలిపారు. రైతు సంఘాలు బలోపేతం అవటంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగు పరచుకోవాలని డ్వామా పీడీ రామచం ద్రారెడ్డి సూచించారు. అప్కాబ్ ఏజీఎం నమీదా సుల్తానా, డీసీసీబీ డీజీఎం ఉమామహేశ్వర రెడ్డి, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాస్, ఏపీజీబీ ఆర్ఎం పీవీ రమణ, వివిధ బ్యాంకులు, ప్రభుత్వ అధికారులు, ఎఫ్‌పీవో సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పాదపద్మారాధన సేవ



అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 13: నంద్యాల సంజీవనగర్‌లోని కోదండ రామాలయంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే విష్ణ్వేశ్వర స్వామి పంచామృత అభిషేకం, అలంకరణ, హారతి, తదుపరి మూల విరాట్‌కు అష్టదళ పూజ చేశారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులపై కక్ష సాధింపు తగదు'



నంద్యాలలో మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు



నందికొట్కూరు ఎంఈవో కార్యాలయం వద్ద జీవో ప్రతులను కాల్చివేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 13: డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలనే ఉద్దేశంతోనే అప్రెంటిసిషిప్ విధానాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు అర్థరహితమని, ఉపాధ్యాయులపై కక్షసాధింపు తగదని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ల ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసుకొని ఉత్తీర్ణ సాధించి, పోటీ పరీక్షలైన టెట్, డీఎస్సీల ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి నిబద్ధతతో పనిచేయాలని ఉంటుందనే ఆలోచన మంత్రికి లేకపోవడం అజ్ఞానమని అన్నారు. ఉపాధ్యాయ సంఘాల సుదీర్ఘపోరాటాల ఫలితంగా అప్రెంటిస్‌షిప్ విధానాన్ని 2012లో అప్పటి ప్రభుత్వం రద్దు చేసిందని, మళ్లీ 12సంవత్సరాల తర్వాత వైసీపీ ప్రభుత్వం దాన్ని పునరుద్దరించడం ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని మండిపడ్డారు. ఈ విధానాన్ని రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మెగా డీఎస్సీ అంటూ నాలుగున్నరేళ్ల కాలయాపన చేసి అన్ని యాజమాన్యాలలో ఉన్న ఖాళీలను కలిపి 6100 పోస్టులతో డీఎస్సీ విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు, పుల్లయ్య, మునిస్వామి, పవన్‌కుమార్, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటిషిప్ విధానాన్ని ప్రవేశ పెట్టడం అన్యాయమని, ఇందుకు నిరసనగా నందికొట్కూరు ఎంఈవో కార్యాలయం ఎదుట జీవో ప్రతునలు యూటీఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యమలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను కావాలని సృష్టిస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులను మోసం చేసే విధంగా డీఎస్సీని ప్రకటించి, పైగా అప్రెంటిస్‌షిప్ విధానాన్ని అమలు చేస్తామని తెలపడం మోసం కాదా? అని ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, ఇది నిరుద్యోగులను దగా చేసే డీఎస్సీ అని మండిపడ్డారు. అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకరెడ్డి, మండల నాయకులు తిమలయ్య, జయమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు ఇవ్వండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 13: వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వల్నరబుల్ మ్యాపింగ్ రిపోర్ట్-2 (సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల రిపోర్టులు) ఇవ్వాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమర్థవంత నిర్వహణపై నోడల్ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల బృందాలకు ఈ నెలాఖరులోగా అన్ని శిక్షణలు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫారంలను వెంటనే పూర్తిచేసి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే వీడియో, వ్యూయింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ తదితర టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా బృందాలు నిర్వహించాల్సిన విధులపై సమగ్ర అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ



ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ సిబ్బంది

పాణ్యం, ఫిబ్రవరి 13: ఆలమూరులో మంగళవారం తపాలాశాఖ ఆదర్వర్యంలో పొదుపు పథకాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. నంద్యాల పోస్టల్ సబ్ డివిజన్ ఏఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో తపాలాశాఖ పొదుపు పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసు అందించే వడ్డీ, పొదుపు ఆవశ్యకత గురించి వివరించారు. సబ్ పోస్టుమాస్టర్, బీపీఎం, ప్రజలు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'



మాట్లాడుతున్న ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య

గడివేముల, ఫిబ్రవరి 13: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆటో డ్రైవర్లను ఆదేశించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అతివేగంగా వాహనాలను నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి'



లక్ష్మాపురంలో ఉపాధి కూలీలతో సమావేశమైన నాయకులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 13: రైతు సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు డేవిడ్ కోరారు. మంగళవారం బండిఆత్మకూరు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ముందుగా మండల రైతు సంఘం అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా మద్దిలేటిరెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో రాజు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పగిడ్యాల: కార్మిక సంఘలు, జాతీయ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. నాయకులు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ గౌడ్, జమ్మన్న తదితరులు ఉన్నారు.

'కనీస సౌకర్యాలు కల్పించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 13: నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు కోరారు. మంగళవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా.ప్రసాదరావును నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. మధు, పెద్దారెడ్డి తదితరులున్నారు.

అంకితభావంతో పనిచేయాలి: డీఎస్పీ



ఎస్ఐ కృష్ణమూర్తిని సత్కరించిన డీఎస్పీ, సీఐలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13: పోలీసులు అంకితభావంతో పనిచేయాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆత్మకూరు ఎస్సైగా పనిచేసి బదిలీపై మంత్రాలయం నియోజకవర్గంలోని మాధవరానికి వెళ్తున్న ఎస్ఐ కృష్ణమూర్తికి మంగళవారం ఆత్మకూరు పోలీసుస్టేషన్ ఆవరణ సన్మానసభ నిర్వహించారు. ఆత్మకూరు టౌన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, నందికొట్కూరు రూరల్ సీఐ వెంకటరమణ, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు, మిడ్తూరు ఎస్ఐలు నారాయణరెడ్డి, హరిప్రసాద్, అశోక్, భూపాలుడు, ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 13: మండలంలోని లింగాపురం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం సీఎస్ఐ చర్చి మూడో వార్షికోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పోటీలను వైసీపీ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం ఏడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులను ఎంపీటీసీ అర్జున్, శీను అందజేశారు. అలాగే సాయంత్రం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను స్థానిక టీడీపీ నాయకుడు హేమసుందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీశైలం, ఫిబ్రవరి 13: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



టంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందచారి

బనగానపల్లె, ఫిబ్రవరి 13: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. మంగళవారం మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు అధిక మార్కులు ఎలా సాధించాలి అనే విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకు వంద సూత్రాలు అనే పుస్తకం కాపీలను ఆయన పంపిణీ చేశారు. క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. హెచ్ఎం పర్వీన్‌బాను మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బుగ్గానిపల్లి తండాలో దేవర



గ్రామంలో సేవాలాల్ మహరాజ్‌కు పూజలు చేస్తున్న ధర్మవరం గౌతమ్ రెడ్డి

బేతంచెర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని బుగ్గానిపల్లె తాండ గ్రామంలో వెలసిన సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్, మారెమ్మ దేవరను గిరిజనులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ దేవర ఉత్సవాలకు పారిశ్రామికవేత్త బీఎస్ సంజీవరెడ్డి, డోన్ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి హాజరై సేవాలాల్ మహారాజ్, మారెమ్మ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మేకల నాగరాజు, రూబెన్, రవీంద్ర నాయక్, రామగోపాల్, నంద్యాల మధు, చంద్ర, లోకేశ్‌గౌడు, మాధవ్, శ్రీపతినాగరాజు, కానాల అంజి, వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

డోన్(రూరల్), ఫిబ్రవరి 13 : పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో బస్సు షెల్టర్ ఏర్పాటు కోసం డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ స్థల పరిశీలన చేశారు. బేతంచెర్ల ప్రధాన రోడ్డు నుంచి నంద్యాలకు రాయలచెరువు ప్రాంతాలకు బస్సుల రాకపోకలు నిత్యం ఉంటాయి. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు మున్సిపల్ అన్నారు. ఈ పరిశీలనలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, మున్సిపల్ డీఈ రసూల్ ఉన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

డోన్(రూరల్), ఫిబ్రవరి 13 : మంగళవారం వెలువడి జేఈఈ-మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో డోన్ శ్రీసుధా జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శ్రీసుధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఏ.విశ్వజిత్ (99.91 శాతం), బి.రంగనాథ్ రెడ్డి (99.29 శాతం) కె.సాయినాథ్ రెడ్డి (93.38), కేఎం ఈశ్వర్ ప్రసాద్ (97.27), బి.గౌతమ్ రెడ్డి (96.29), కేహర్షవర్ధన్ రెడ్డి (97.21), ఎం.ఇందు (88.49), ఎం.వినోద్ (88.07), ఎం.కోమల శ్రీయ (86.33) ఎస్.మనోజ్ కుమార్ (84.29), పి.వినయ్ (81.77), ఎం.మురళి నరసింహ ముకేష్ (80.55) శాతం సాధించారని ప్రిన్సిపాల్ యోగానందరెడ్డి తెలిపారు. ఆయన వారిని అభినందనందించారు.

వైసీపీ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దు

డోన్(రూరల్), ఫిబ్రవరి 13 : వైసీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు అలా మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దగా చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామాల్లో పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు సచివాలయాల్లో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు జగన్ ప్రభుత్వం వసూలు చేసిందన్నారు. ఇళ్ల స్థలాల నివాస రిజిస్టర్ పత్రాలు బ్యాంకులలో లోన్లకు కూడా పనికిరావడం లేదని అన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



బీసీ జనార్దన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 13: కోవెలకుంట్ల మండలంలోని బిజనవేముల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు, మంగళవారం గ్రామానికి చేరుకున్న బీసీకి టీడీపీ నాయకులు గజ్జల అన్వర్ బాషాతో పాటు టీడీపీ నాయకులు బీసీకి ఘన స్వాగతం పలికారు.

ఉద్యమాలు ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు షమీవుల్లా

డోన్(రూరల్), ఫిబ్రవరి 13 : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఏపీ ఎన్జీవోస్ జేఏసీ నాయకులు షమీవుల్లా హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సమస్యలు పరిష్కారం కోరుతూ దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 14న నల్లబ్యాడ్జీలతో నిరసన, 15న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన, 20న ర్యాలీలు, 27న ఛలో అసెంబ్లీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రమణ, మౌలాలి, ప్రేమ్ కుమార్, రాముడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు

● డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



మేనిఫెస్టో గురించి వివరిస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 13 : వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని గోసానిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ టీడీపీ సంక్షేమ పథకాలను వివరించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో చెత్తపై పన్ను వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, అహంకార నియంతృత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, యూనిట్ ఇన్‌చార్జి కమలాపురం రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, గోవిందరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు రామాంజనేయులు, మెట్ట మద్దయ్య పాల్గొన్నారు.

● రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అభిరెడ్డిపల్లె గ్రామంలో జరిగిన దేవర కార్యక్రమానికి సుబ్బారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ కార్యదర్శి సీఎం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అభిరెడ్డిపల్లె గోవిందు, మిద్దెపల్లి గోవిందు, జయన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, గోవిందరెడ్డి, రామాంజనేయులు, నీలం ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీ విజయానికి కృషి చేయాలి'



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 13: ప్రతి కార్యకర్త వచ్చే ఎన్ని టీడీపీ విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి అఖిలప్రియ కోరారు. మండలంలోని కోట కందుకూరు గ్రామంలో 30 ఎస్సీ కుటుంబాలు మంగళవారం వైసీపీని వీడి మాజీ మంత్రి అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. అఖిలప్రియ మాట్లాడుతూ రోజురోజుకు టీడీపీకి ఆదరణ పెరుగతోందన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులతో విసుగెత్తిన వారంతా టీడీపీలో చేరుతున్నారని, వారందికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భార్గవ్‌రామ్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, ఎస్సీ నాయకులు సత్యనారాయణ, ఆదినారాయణ, బాలదాసరి, జ్వాలా తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 13: పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మెయిల్ వర్సల్స్ భాస్కరరావు, పెద్దరాజు, పోస్టల్ సిబ్బంది సురేష్, పద్మావతి, కార్తీక్, జాఫర్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టుకు గౌరవ డాక్టరేట్



హిమవర్ధన్

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 13: మండలంలోని బాచేపల్లె గ్రామానికి చెందిన ఫిజియోథెరపిస్టు హిమవర్ధన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డులో తన పేరు నమోదైందని మంగళవారం ఆయన చెప్పారు. ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకుంటానని హిమవర్ధన్ చెప్పారు. చిన్న వయసులోనే ఫిజియోథెరపిస్టుగా ఎక్కువ కేసులను నయం చేయడంతో తన సేవలకు గాను తనకు గౌరవ డాక్టరేట్ లభించిందని హిమవర్ధన్ చెప్పారు.

దేవరాయపురంలో ఉత్సవ పల్లకి



స్వామి, అమ్మవార్లకు పూజలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 13: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకి గ్రామాల్లోని ప్రజలచే పూజలందుకుంటున్నది. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని దేవరాయపురంలో మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

'అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

దొర్నిపాడు, ఫిబ్రవరి 13: అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ గుండ్రాతి సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డా. రూహుల్లాఖాన్ హాజరై రోగులకు బీపీ, షుగర్, రక్తపరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ధార్మిక కార్యక్రమాలు ప్రారంభం

శిరివెళ్ల, ఫిబ్రవరి 13: మండలంలోని యర్రగుంట్ల ఎస్సీ కాలనీలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రపంచానికి నాగరికత నేర్పింది భారతదేశమేనని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. శ్రీమద్రామాయణం-జాతికి సందేశం అనే అంశంపై ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్‌జీ ప్రవచనాలు బోధించారు. హిందూ గ్లోబల్ హెరిటేజ్ ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వరరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య, శిరివెళ్ల ప్రఖండ అధ్యక్షుడు నడిపి సుబ్బారెడ్డి, బజరంగదళ్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ భద్రతా రహదారి మాసోత్సవాలు



జాతీయ భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న లారీ డ్రైవర్లు

బనగానపల్లె, ఫిబ్రవరి 13: బనగానపల్లె పట్టణ శివారులోని జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణంలో జిల్లా రవాణాధికారి శివారెడ్డి, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ తిమ్మరుసునాయుడు ఆధ్వర్యంలో జాతీయభద్రతా రహదారి మాసోత్సవాల సందర్భంగా మంగళవారం అవగాహన కల్పించారు. డ్రైవర్లు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

శిరివెళ్ల, ఫిబ్రవరి 13: శిరివెళ్లలో జీర్ణోద్ధరణ చేసిన అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర-బసవేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలను నిర్వాహకులు, గ్రామ పెద్దలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20న గణపతి పూజ, రక్షాబంధనం, నవగ్రహ హోమం, సాయంత్రం సంకీర్తనా మహా యజ్ఞములో భాగంగా కోలాటం ఏర్పాటు చేశారు. 21న ప్రతిష్ఠామూర్తులకు ధాన్యాధివాసం, అధివాసాంగ హోమా లు, మధ్యాహ్నం నందికోల సేవలతో ప్రతిష్ఠామూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 22న గోపూజ, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

16 నుంచి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు

చాగలమర్రి, ఫిబ్రవరి 13: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో నూతనంగా వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, వీరభద్రస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను నూతనంగా నిర్మించారు. రూ.1.30 కోట్లతో ఆలయాలను నూతనంగా నిర్మించారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయాల్లో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక హోమాలు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

'మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం'



డి.వనిపెంట పాఠశాలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సూరి

చాగలమర్రి, ఫిబ్రవరి 13: గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలికుడు సూరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని డి.వనిపెంట, కొత్తపల్లి, కేపీ తండా, చెంచుగుడెం పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయుటకు ప్రణాళిక చేశారన్నారు. ట్రైబల్ ప్రాంతాల్లోని పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయడానికి పాఠశాలలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట అకడమిక్ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి యూసబ్ బాషా, జిల్లా కో-ఆర్డినేటర్ దావిద్, ఆళ్లగడ్డ సీడీపీవో తేజస్విని, ఎంఈవో అనూరాధ, హెచ్ఎంలు శంకర్, పద్మావతి, జాన్సన్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 13: మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ రమణమ్మ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంపులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి ఉంచాలని సెక్టోరల్ అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట వీఆర్వోలు ఇమామ్‌బాషా, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

ఆలయ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 13: కొలిమిగుండ్ల మండలం పెట్టికోట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం, సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కలశస్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'పంట నమోదు తప్పనిసరి'



నేలంపాడులో ఈ-క్రాప్‌ను పరిశీలిస్తున్న ఏవో రంగనేతాజీ

చాగలమర్రి, ఫిబ్రవరి 13: గ్రామాల్లో రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. మంగళవారం మండలంలోని నేలంపాడు గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈక్రాప్ నమోదును పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ 16వ తేదీ లోపు రైతులు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రామిరెడ్డి, రైతులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న హెచ్ఎం కోటయ్య

చాగలమర్రి, ఫిబ్రవరి 13: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గఫార్‌బాబు తయారు చేసిన 'యూజింగ్ స్మార్ట్ కార్డు' ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం కోటయ్య మంగళవారం తెలిపారు. ఈనెల 11న నంద్యాల జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనలో గఫార్‌బాబా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఎంపికైన విద్యార్థి గఫార్‌బాబాను ఉపాధ్యాయులు, హెచ్ఎం కోటయ్య అభినందించి మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి గైడ్‌గా వ్యవహరించిన శ్రీనివాసులును హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్రామస్థులకు తెలియకుండానే ఆలయ జీర్ణోద్ధరణ'



ఆలమూరులో మాట్లాడుతున్న బాచుపల్లె నారాయణ

రుద్రవరం, ఫిబ్రవరి 13: ఆలమూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ పనులు గ్రామస్థులకు తెలియజేయకుండానే ప్రారంభించారని, ఇది సమంజసమా? అని టీడీపీ నాయకులు బాచుపల్లె నారాయణ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామసభ పెట్టకుండా విగ్రహాలు, ధ్వజస్తంభం పెకలించారన్నారు. గ్రామంలో దేవాలయ అభివృద్ధి పనులు చేసే ముందు గ్రామస్థులకు తెలియజేయాలి కదా? అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సుమారు 15 ఎకరాల మాన్యం ఆలయానికి ఉందన్నారు. సుమారు రూ.5 లక్షలతో పనులు చేసే ముందు ఎస్టిమేషన్ వేసి గ్రామస్థులతో చర్చించి పనులు ప్రారంభించాలన్నారు. ఆలయంలో చెన్నకేశవస్వామి అమ్మవారు, నరసింహస్వామి నూతన విగ్రహాల ఏర్పాటుతో పాటు ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

'వందశాతం ఫలితాలు సాధించాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 13: జిల్లాలో కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలని జీసీడీవో నాగ సువర్చల సూచించారు. రుద్రవరంలోని కేజీబీవీని మంగళవారం తనిఖీ చేశారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ప్రశ్నిస్తూ పాఠ్యాంశాలు ఎలా బోధించారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. వంటశాలలో తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఉన్న రోటరీ క్లబ్ సమావేశ భవనంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామేశ్వరరెడ్డి, శ్రీధర్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు కర్నూలు ఎక్సెల్ అకాడమీ నిర్వాహకులు గంప నాగేశ్వరరావు, మహేంద్ర, గోపినాథ్, శివప్రసాద్, లక్ష్మిప్రసాద్ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలు బాగా రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సత్తార్ మాణిక్యం శెట్టి, విజయ నాగరాజు, వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 13: కోవెలకుంట్లలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సరోజిని దేవి చిత్రపటానికి పూలమూలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ ఎం రాజయ్య, ఉపాధ్యాయలు నాగేశుడు, జెహిరాబి, మల్లికార్జున శివశంకర్ రెడ్డి,తిరుపతి సురేష్ వెంకట రమేష్ వెంకటేశ్వర్లు శైలజ తదితరులు పాల్గోన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



పాఠశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 13: ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల నాయకులు ప్రదీప్ నంద విశ్వనాథ్, విజయ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులపై పోరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. నూతన విద్యావిధాన్ని రద్దు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్, రమేష్, సిద్దు, జగదీష్, రియాజ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటిని తోడేస్తున్నారు

● అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిర్వాకం
● చేపలు చనిపోతున్నాయని బెస్త సంఘం సభ్యుల ఆవేదన



చెరువులో మోటర్లతో నీటిని తరలిస్తున్న దృశ్యం



ఆలమూరు చెరువు వద్ద బెస్త సంఘం సభ్యులు

రుద్రవరం, ఫిబ్రవరి 13: మండలంలోని ఆలమూరు గ్రామం చీలబోయిన చెరువులో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారం అడ్డు పెట్టుకుని ఆయిలింజనుతో చెరువులో నీటిని తోడేస్తున్నాడంటూ సుమారు 50 నుంచి వంద మంది బెస్తసంఘం సభ్యులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని తోడేస్తుండడంతో చెరువులో చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వంద కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. మూడు నెలల క్రితం రూ.10 లక్షల పెట్టుబడితో 2.50 లక్షల చేపపిల్లలను చెరువులో వదిలామని చెప్పారు. అయితే చెరువులో నీరంతా తూముల ద్వారా బయటికి వెళ్లిందని, తూముల ద్వారా పారే నీరు నిలిచిపోయిందని చెప్పారు. చెరువులోపల గుంతల్లో ఉన్న నీటిని ఆయిలింజనుతో తోడేస్తున్నారని వాపోయారు. ఈ సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రానాథ్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

వంద కుటుంబాలకు ఆధారం



చెరవులో చేపల పెంపకం వంద కుటుంబాలకు ఆధారం. చేపల పెంపకంపై జీవిస్తున్నాం, బెస్త సంఘం సొసైటీ తరపున 2.50 లక్షలు చేపపిల్లలకు పదిలక్షలు పెట్టుబడి పెట్టాం. చెరువులో నీటిని తోడేయడంతో చేపలు చనిపోతున్నాయి.

పాములేటి, బెస్త సంఘం సొసైటీ అధ్యక్షుడు

చేపలు చనిపోతున్నాయి



చెరవులో నీరు ఆయకట్టు భూములకు తూముల ద్వారా పారుతున్న నీటిని ఏనాడు అడ్డుకోలేదు. తూముల నుంచి నీటి పారకం నిలిచిపోయింది. చెరువులో నీటి సామర్థ్యం తగ్గింది. గుంతల్లో నిలిచింది. ఈ నీటిని తోడేయడంతో చేపలు చనిపోతున్నాయి.

- లింగన్న, బెస్త సంఘం మాజీ అధ్యక్షుడు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెరువుపై వంద కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. తరతరాలుగా చేపలు పెంచుకుని జీవిస్తున్నాం. ఇలా చేయడం సమంజసం కాదు.

హరిశంకర్, ఆలమూరు

సమంజసం కాదు

అధికారం అడ్డుపెట్టుకుని ఇలా చేయడం సమంజసం కాదు. తూముల ద్వారా ఆయకట్టు భూములకు పారే నీటిని మేం ఆపలేదు. చెరువులోనే ఇంజను ఏర్పాటు చేసి నీటిని తోడడంతో చేపలు చనిపోతున్నాయి. నీటిని తోడి మా కడుపు కొడుతున్నారు.

చిన్నహుసేని, ఆలమూరు